(పాతికేళ్ళ తర్వాత)




చిత్రకారుడు : బాపు (1961)

రచన మాసపత్రిక (జనవరి, 1992)

# బాపూ బొమ్మా!...

## (పాతికేళ్ళ తర్వాత)

## ముందుమాట:

నా 'బాపూ బొమ్మ!' కథ 25.1.61తేదీ ఆంధ్రపత్రికలో ప్రచురింపబడింది. "సిల్వర్ జూబిలీ అయింది - మరోసారి మీ 'బాపూబొమ్మ'ని గుర్తు చేసుకోవద్దా!" అన్నారు కొందరు మిత్రులు. వారి ప్రేరణే ఈ కథారచనకి మూలం. ఆనాటి 'బాపూ బొమ్మ' కన్న కూతురే ఈ బాపూబొమ్మ-2!

"బామ్మా!" అని పిలిచాడు రామం.

స్వెట్టరు అల్లుతున్న శశికళ ఊకొట్టి అతనివైపు గోముగా చూసింది. ఎన్నేళ్ళు గడిచినా ఇప్పటికీ అతని చేత 'బామ్మా' అని పిలిపించుకోవటం ఆమెకి ముక్కువ.

పందొమ్మిదేళ క్రితం శిరీష పుట్టింది. కూతుర్ని ఒళ్ళోకి తీసుకొని 'చిన్నబామ్మా' అని పిలుస్తుండేవాడు రామం. 'అబ్బ దాన్నలా పిలవకండి' అని చిరుకోపం ప్రదర్శించేది శశికళ. 'ఏం? బామ్మకి పుట్టింది బామ్మ కాక మరేమవుతుంది?' అని మేలమాడేవాడు అతను.

'ఇప్పుడు నామీద మీకు మోజు తీరిపోయిందిలెండి' అని ప్రణయకోపం ప్రదర్శించేది ఆమె. తన భర్త ప్రేమంతా తనకే కావాలి. దాన్నెవరూ పంచి పుచ్చుకోకూడదు - చివరికి కన్న కూతురయినా సరే - కూతుర్ని చూసి ఈర్ష్య పడుతున్న తల్లి! అతనికి ముచ్చటేసేది. నవ్వొచ్చేది. ఆమెనింకా ఉడికించాలని 'క్వీన్స్‌రైవల్' అని కూతుర్ని గట్టిగా కౌగిలించుకొని ముద్దుల వర్షం కురిపించేవాడు రామం.

ఆ పిల్లే కొంచెం పెద్దదయి ఓసారి 'అదేంటమ్మా! నిన్ను నాన్న బామ్మ అని పిలుస్తారేమిటి?'

అని అడిగేసరికి తను జవాబు చెప్పలేక సిగ్గుతో ముడుచుకుపోయింది. ఆ మాట విని అక్కడికి వచ్చిన రామం 'నే చెపుతా ఇలా రామ్మా' అని వెంట తీసుకువెళ్ళాడు. తన కథలఫైలు తెరిచి చూపించాడు....' ఇదిగో మీ అమ్మ ఈ బొమ్మలా లేదూ?' అని అడిగాడు. ఆ పిల్ల కళ్ళు తళ తళ మెరిసాయి. 'అవునవును' - అంటూ తన చిట్టి చేతులతో తప్పట్లు కొడుతూ తలవూపింది.

'అందుకనే ఆ రోజుల్లో మా కాలేజీ కుర్రాళ్ళంతా మీ అమ్మని బాపూ బొమ్మ - అని పిలిచేవాళ్ళు. కొందరు కొంటె కుర్రాళ్ళు మధ్య అక్షరాలు.... ఇలా మింగేసి.... బామ్మా అని పిలిచేవాళ్ళు.' అని నవ్వాడతను.

'కొంటె కుర్రాళ్ళంటే?' అని కళ్ళింత చేసి అడిగింది శిరీష. 'మీ నాన్నలాంటి వాళ్ళు!' అంది అప్పుడే అక్కడికి వచ్చిన శశికళ. 'ఓహో! అందుకనే నాన్న నిన్ను బామ్మా - అని పిలుస్తారన్నమాట!' అంది ఆ పిల్ల తనకేదో అర్థమయినట్టు. రామం పకపక నవ్వాడు. 'అబ్బ, చిన్నపిల్లతో ఏమిటా మాటలు!' అని చిరుకోపం చూపింది శశికళ.

ఆనాటి చిన్నపిల్ల తల్లిని తండ్రి 'బామ్మా' అని పిలిస్తే అర్థం చేసుకొని ముసిముసిగా నవ్వుకునేంత పెద్దదిగా ఎదిగింది ఇప్పుడు. కాలేజీలో బి.ఎస్‌సి. ఫైనలియర్ చదువుతోంది....

"ఇలారా!" అని పిలిచాడు రామం.

శశికళ దగ్గరగా వచ్చింది. అంతవరకు అల్లిన స్వెట్టర్ని అతని వెన్నుమీది ఉంచి "ఇంక అయిపోవచ్చింది. మీ అమెరికా ప్రయాణానికి అన్నీ సిద్ధమయిపోయినట్టే!" అంది.

"ఎందుకో నాకు అమెరికా వెళ్ళాలని లేదు' అన్నాడతను.

శశికళ చిత్రంగా చూసింది, "ఎందుకు వెళ్ళాలని లేదు?"

"మిమ్మల్నందర్నీ వదలి వెళ్ళాలంటే....."

"భలేవారే! ఎల్లకాలం అక్కడే ఉండిపోతారాయేం! గవర్నమెంటు పంపుతోంది. మీరు వెడుతున్నారు. రెండునెల్లు. ఇట్టే గడిచిపోతాయి."

"నిజంగా నన్ను వదిలిపెట్టి వుండగలరా మీరు?" అన్నాడతను దిగులుగా.

అతనింకా బాధపడతాడని తనకు తనే గుండె ధైర్యం తెచ్చుకొని "చూడండి. మీరమెరికా వెళ్ళటం మీకోసం కాదు. మా కోసం. అమ్మాయి - అబ్బాయి - మానాన్న అమెరికా వెళ్ళారని - వాళ్ళ ఫ్రెండ్సుతో గొప్పగా చెప్పుకోవద్దా? నేను మాత్రం మా వారు ఫారెన్ రిటరన్డ్ అని అందరితో ఘనంగా చెప్పుకోవద్దా!" అని పరిహాసమాడింది.

"ఇటురా!" అని ఆమెను తనకు దగ్గరగా కూర్చోపెట్టుకొని ఆమె తలవొంచి తడిమి తడిమి ఒక వెంట్రుకను లాగాడు. "అప్పుడే నీతల్లో తెల్లవెంట్రుకా?" అన్నాడు ఆశ్చర్యపోతూ.

శశికళ క్షణంపాటు బిత్తరగా చూసింది. అంతలోనే పల్చగా నవ్వింది. "ఎల్లకాలం అప్పటిలా అలాగే వుండిపోతాననుకున్నారా?"

"నువ్వలా నవ్వకు. నేను భరించలేను." అన్నాడతను విషాదవదనంతో.

"ఇన్ని కథలు రాస్తారు. జీవితం మీద ఎన్నో భాష్యాలు చెపుతారు. ఒక్కోసారి ఇంత పిచ్చిగా మాట్లాడాతారేమిటి?" అంది ఆమె లాలనగా అతని చేతిమీద చేయివేసి.

కొన్ని క్షణాలపాటు ఆమెను తేరిపార చూసాడు రామం. "మన పెళ్ళయి ఇన్నేళ్ళయినా నీలో ఏ మార్పు కనిపించలేదు నాకు. నువ్వూ శిరీ అప్పచెల్లెళ్ళలా వుంటారని చాలామంది అనుకుంటుంటారు. ఇన్నాళ్ళుగా లేని మార్పు నీలో నాకొక్కసారిగా ఎందుకనిపిస్తోంది....?"

"ఇప్పుడే ఇంత హైరానా పడిపోతున్నారే.... మరి కొన్నాళ్ళు పోతే మన బాబుకి పెళ్ళయి నిజంగానే నేను బామ్మనయితే అప్పుడేమనుకుంటారు?" అని వేదాంతిలా నవ్వింది శశికళ.

కాలాన్ని ఎవ్వరూ ఆపలేరు. పెరిగే వయస్సు తన ముద్రల్ని తను వేసుకుపోతుంది. తను గ్రహించని జీవిత సత్యాన్ని శశికళ ఎంత తొందరగా గుర్తించింది! నిన్న మొన్నటివరకూ ప్రణయకోపాలతో తన కళ్ళముందు తిరిగిన ఈ చిన్నారి శశి ఎంత తొందరగా ఎదిగిపోయింది....! ఆశ్చర్యంగా ఆమె వైపు చూస్తుండి పోయాడు రామం.

అతని చేతిలోని తెల్ల వెంట్రుకని తన చేతిలోకి తీసుకొని, "ఈ వెంట్రుక ఏమని చెపుతోందో చెప్పనా!" అంది ఆమె.

"ఏమని?"

"మన శిరికి పెళ్ళీడు వచ్చిందని" ఆమె నవ్వింది.

తన బాపూ బొమ్మ ఒక్కసారిగా ఇంత పెద్దదానిలా మాట్లాడ్డం మనస్కరించలేదతనికి. "ఛ! చిన్నపిల్ల. అప్పుడే పెళ్ళేమిటి దానికి!" అన్నాడు.

"మన పెళ్ళికి నా వయస్సెంత? అప్పటికి నా చదువు కూడా పూర్తికాలేదు. గుర్తుందా మీకు?"

"అందుకే దాని చదువు పూర్తయ్యేదాకా పెళ్ళి మాట ఎత్తద్దు మనం."

"అంటే డిగ్రీ చదువు చాలదా దానికి?"

"అదెంత వరకూ చదువుకోవాలంటే అంతవరకు చదివిద్దాం."

"ఎమ్మెస్సీ చదివితే - దానికి డాక్టరేట్ చేసినవాడ్ని తేవాల్సివస్తుంది...."

"ముందు డిగ్రీ కానీ! ఆ తర్వాత ఏం చేయాలో ఆలోచిద్దాం...."

శిరీష కాలేజీనుంచి రావటంతో ఆ సంభాషణ ఆగిపోయింది.

"ఏం నాన్నా - ఈవేళ ఆఫీసుకి దుమ్మా కొట్టేసావా?" అని అడిగింది శిరీష నవ్వుతూ.

"అవునమ్మా! అమెరికా వెళ్ళిపోతున్నా కదా! బామ్మతో కాసేపు కబుర్లాడుదామని!" అని నవ్వాడు రామం.

"అమెరికా నుంచి మీ బామ్మకేం తెస్తావు నాన్నా!" అని కొంటెగా నవ్వింది శిరీష.

"అక్కడ్నించి నాకేం తేనక్కర్లేదు కాని..... వెళ్ళేముందు మీ అమ్మాయికి మాత్రం ఓ మాట చెప్పి వెళ్ళండి. ఫ్రెండ్సంటూ ప్రొద్దుపోయేదాకా బయట తిరగవద్దని. పెందరాళే ఇంటికి వస్తూండమని చెప్పి వెళ్ళండి" అంది శశికళ.

శిరీష ముఖం ముడచుకుంది. "నేనెక్కడికి వెడుతున్నానని?..."

"మొన్న లేటుగా వచ్చావు. రేణుక బర్త్‌డే పార్టీ అన్నావు. నిన్న లేటు, అరుణతో సినిమా అన్నావు...."

"అదేమిటి నాన్నా! అమ్మ అలా అంటుందేమిటి? తను కాలేజీలో చదువుకుంది. తనుమాత్రం తన ఫ్రెండ్సుతో వెళ్ళలేదూ?" అంది శిరీష.

"అమ్మ మాత్రం ఏమందమ్మా! నీ జాగ్రత్తలో నువ్వుండాలంది. అంతేగా!...."

రామం మాటలకడ్డు వచ్చింది శశికళ. "..... మీరిలా మెత్త మెత్తగా మాట్లాడుతూ నెత్తికెక్కించుకోండి. నేనంటే లెక్కలేకుండా పోతోంది దానికి."

"చూసావా నాన్నా!" అమ్మ ఎంతేసి మాటలంటోందో?"

"ఉన్నమాటే అంటున్నా. మేం మా ఫ్రెండ్సుతో వెళ్ళలేదా అని అడుగుతున్నావు. వెళ్ళాము. కాని, ఇంట్లో పెద్దవాళ్ళతో చెప్పి వాళ్ళు వెళ్ళమంటేనే వెళ్ళేవాళ్ళం. మరి నువ్వు? వెళ్ళొచ్చి అప్పుడు వెళ్ళానని చెపుతున్నావు. అప్పటికీ ఇప్పటికీ ఇంతే తేడా!" అంది శశికళ చురచుర చూస్తూ.

కూతురి ముఖం చిన్నబోవటమూ ఇష్టంలేదు. భార్య అలా ఎంతో పెద్దదానిలా కూతురికి నీతులు చెప్పటమూ ఇష్టంలేదు. అందుకే "సర్సరే! ఈవేళ అంతా ఇంట్లోనే వున్నాం కదా! బాబు స్కూలునుంచి రాగానే అంతా కల్సి ఏదయినా సినిమాకి వెడదాం...." అని అక్కడితో ఆ సంభాషణని మరోవైపు మళ్ళించాడు రామం.

• • •

అమెరికాలో వున్నది రెండు నెలలే అయినా రెండేళ్ళలా అనిపించాయి రామానికవి. భార్యాబిడ్డల్ని ఎప్పుడు చూస్తానా అని తహతహలాడుతూ తిరిగి వచ్చాడు. ఎంతో ఉత్సాహంతో వాళ్ళు తనకెదురు వస్తారని - తెచ్చిన సామాన్లు చూపించి వాళ్ళని ఆనందాశ్చర్యాలతో ముంచాలని - తనవాళ్ళంతా కళ్ళు చేసుకుంటూ ఇంట్లో అడుగుపెట్టాడు. కాని, అక్కడ అతనికో షాక్ ఎదురయింది!

శశికళ ముఖంలో ఎక్కడా కాంతి లేదు. తనకోసం బెంగపెట్టుకొని అలా వుందనుకున్నాడు రామం. "ఎందుకంత చిక్కిపోయావు? చక్కనమ్మ చిక్కినా అందంగా వుంటుందని నిరూపించాలనా?" అని మేలమాడాడు.

ఆమె బలవంతంగా నవ్వింది. "మీ ప్రయాణం బాగా జరిగిందా?"

"బాగానే జరిగింది కాని, అలా వున్నావేమిటి? శిరి, బాబు ఏరి?"

"కాసేపట్లో వస్తారు. మీరు ముందు స్నానం చేసి భోంచేయండి. ఎప్పుడు తిన్నారో ఏమో!"

స్నానంచేసి వచ్చాడతను. అన్నం వడ్డించింది శశికళ.

"ఈ అన్నం కోసం రెండునెల్లపాటు మొహం వాచిపోయాను."

ఆమె పల్చగా నవ్వింది.

ఆమె పరధ్యాన్నం అతనికి చిత్రమనిపించింది. "నువ్వూ పెట్టుకో!" అన్నాడు.

"తర్వాత తింటా. ముందు మీరు" అంది ఆమె.

అన్నం కలుపుకుని మొదటి ముద్ద తిన్నాక రెండో ముద్ద ఆమె నోటికందిస్తూ 'తిను' అన్నాడతను. ఆమె కళ్ళు నీళ్ళు నింపుకున్నాయి. రామం మనస్సు చివుక్కుమంది. "ఎందుకు? వచ్చినప్పట్నించి చూస్తున్నా. ఎందుకంత దిగులుగా వున్నావు?" అన్నాడు ఆమెను దగ్గరగా తీసుకుంటూ.

"మీరు వెళ్ళాక నాకేదీ బాగాలేదు."

"నేను చెప్పలేదూ! నువ్వు వదిలి వుండలేవని."

"అన్నం తినండి. అన్నీ తర్వాత మాట్లాడుకుందాం" అంది కళ్ళు తుడుచుకుంటూ.

అతను బలవంతం చేస్తే అతని చేతిముద్దలు రెండు తనూ తింది. అతని భోజనం అయినాక తన బాధ యేమిటో నెమ్మదిగా చెప్పుకుంది.

నాల్గు రోజుల క్రితం ఫ్రెండ్సుతో అరకులోయకి పిక్నిక్ వెడుతున్నాని చెప్పి వెళ్ళిందట శిరీష. 'నాన్న వచ్చేలోగా వచ్చేస్తా'నందిట. ముందసలు తాను వెళ్ళద్దంది. 'నాన్న వుంటే నన్ను తప్పకుండా వెళ్ళనిచ్చేవారు. ఈ ఒక్కసారికీ నా మాటకొప్పుకోమ్మా!' అని పోరింది. కూతురి పోరుపడలేక వెళ్ళనిచ్చింది తను.

"......నిన్ననగా రావల్సింది. ఇంతవరకూ రాలేదండీ!" అంది శశికళ దిగాలు పడిపోతూ.

"ఈ మాత్రానికే ఎందుకింత కంగారు పడతావ్? ఆ ప్రదేశాలు చూసాక వాళ్ళకి వదలి రాబుద్ధవుతుందా? మనం వెళ్ళినప్పుడు రెండ్రోలు మనం అక్కడే వుండిపోలేదూ? నిన్న రాకపోతే ఈవేళ వస్తుంది". అన్నాడు రామం తేలిగ్గా నవ్వుతూ.

"మొదట నేనూ అలాగే అనుకున్నానండీ! కాని, అదసలు అరకులోయ వెళ్ళలేదుట! సాయంత్రం బాబుని వసుంధరా వాళ్ళింటికి పంపాను. ఆ పిల్ల వెళ్ళలేదు. అదీకాక తనకు తెల్సినంతవరకు వాళ్ళ ఫ్రెండ్సెవరూ వెళ్ళలేదుట. వసుంధర చెప్పింది."

రామానికి షాక్ తగిలినట్టయింది "అంటే?...."

"ఎక్కడికి వెళ్ళిందో తెలియదు. రాత్రంతా నాకు మతిమతిలో లేదు. ఇన్నాళ్ళకు మీరింటికి వస్తే మంచి వార్త ఏదయినా చెప్పటం పోయి బాధపెట్టే కబురు చెపుతున్నాను" అంటూ కళ్ళనీళ్ళు పెట్టుకుంది ఆమె.

భార్యనెలా వోదార్చాలో అతనికి తోచలేదు. ఎంతోసేపు ఇద్దరూ అలా స్తబ్ధుగా వుండిపోయారు. ఉన్నట్టుండి శిరీష గదిలోకి వెళ్ళి టేబులు మీద ఏదో వెతకసాగాడతను. వెనకనే వచ్చిన శశికళ 'ఏదయినా ఉత్తరం రాసిపెట్టిందనా?' అంది. అతను తలవూపాడు.

"అన్నీ వెదికాను. నాకేం కనిపించలేదు" అంది ఆమె బిక్కు బిక్కుమంటూ.

గబగబ తమ గదిలోకి వెళ్ళి తన ఫైళ్ళూ, పుస్తకాలూ వెదకసాగాడు రామం. దేనికోసం

వెతికాడో అది అతని డైరీలో దొరికింది.

"ఇదిగో అక్కడ పెట్టింది"' అంటూ కాగితం మడత విప్పాడు.

"ఏం రాసింది?" అని శశికళ తొందరపెట్టింది. రామం పైకి చదివాడు.

డియర్ నాన్నా!

నువ్వు అమెరికా నుంచి తిరిగి వచ్చేసరికి స్వాగతం చెప్పటానికి నేనింట్లో లేనందుకు డిజప్పాయింట్ అవుతావని నాకు తెల్సు. వెరీ సారీ నాన్నా! మేం వెడుతున్న టూరిస్టు బస్సు సాయంత్రానిక్కాని తిరిగిరాదు.

ఎక్కడికి వెళ్ళానని అమ్మా, నువ్వు కంగారు పడుతుంటారు. అందుకే ఈ ఉత్తరం! అమ్మతో కాలేజీ ఫ్రెండ్స్‌తో పిక్నిక్ వెడుతున్నానని చెప్పాను. కాని, అది నిజం కాదు.

నాల్గునెలల క్రితం ఎవరో రౌడీలు నా వెంట పడితే వాళ్ళని తన్ని నన్ను మనింటిదాకా తీసుకువచ్చి అప్పగించారు – సుధాకర్! ఆయన్ని అమ్మ చూసింది కాని నువ్వు చూడలేదు. ఆ తర్వాత ఏం జరిగిందో మీకు తెలియదు. నేను చెప్పలేదు.

ఆయనతో కల్గిన పరిచయం మాకు తెలీకుండానే మంచి ఫ్రెండ్‌షిప్‌గా మారింది. అప్పుడప్పుడూ పార్కుకి వెళ్ళేవాళ్ళం. రెండుసార్లు సినిమాకి కూడా వెళ్ళాం. ఇంతవరకూ వచ్చాక ఇంకా మీ దగ్గర దాచేది ఏముంది నాన్నా! నేనంటే ఆయనకిష్టం. ఆయనంటే నాకిష్టం. నన్ను పెళ్ళిచేసుకుంటానన్నారు. ఆ సంగతి మా అమ్మా, నాన్నలతో చెపుతాను.... అన్నాను.

ఇంతలో నీ అమెరికా ప్రయాణం వచ్చింది. నువ్వు తిరిగి వచ్చాక చెప్పవచ్చని ఇంతవరకు వూరుకున్నాను. వాళ్ళ ఆఫీసు వాళ్ళంతా అరకులోయకు పిక్నిక్ ప్రోగాము వేసారని – తనతో పాటు నన్ను రమ్మని ఆయన మరీ మరీ అడిగారు. ఆయన ఆహ్వానిస్తే నేను కాదనలేకపోయా. నేను ప్రతిదానికీ తొందరపడుతున్నానని అమ్మకోభయం! నిజం చెపుదామంటే నువ్వు లేవు. అమ్మతో చెపితే వెళ్ళనివ్వదు. ఆయన్ని డిజప్పాయింట్ చేయటం నాకు మనస్కరించలేదు. అందుకే అమ్మతో అబద్ధం చెప్పా. అందుకు అమ్మా, నువ్వూ క్షమిస్తారు కదూ!

నాన్నా! నాకు నువ్వు చాలా ఫ్రీడమ్ ఇచ్చావు. దాన్ని నేను దుర్వినియోగం చేసుకుంటున్నానని అమ్మ అనుకుంటోంది. కాని ప్రామిస్ నాన్నా! అమ్మకూ, నీకూ మాట తెచ్చే పని యేదీ ఎప్పుడూ నేను చేయలేదు. చేయను. నన్ను నమ్ముతావు కదూ!

–మీ శిరి.

"ఎంత తెగింపు దీనికి!" అంది శశికళ బుగ్గలు నొక్కుకుంటూ. గాఢంగా నిట్టూర్చి వాలు కుర్చీలో వాలాడు రామం.

"ఏమిటలా ఆలోచిస్తున్నారు?" అంది ఆమె పక్కనే కూలబడుతూ.

"మన పెళ్ళికి ముందు ఒక్కసారి ఇద్దరం కల్సి సినిమాకి వెడదామనుకుంటే మా మామయ్య వచ్చి మీ నాన్నగారికి రికమండ్ చేయాల్సి వచ్చింది. ఇప్పుడు? ఎవరికీ తెలీకుండా

పిక్నిక్‌లకి వెళ్ళిపోతున్నారు పిల్లలు. కాలం ఎంత మారిపోయిందో చూసావా!" అని నవ్వాడతను.

"కొంపలు మునుగుతుంటే మీరు నవ్వుతున్నారా?"

"చూడు శశీ! ఓ వయస్సు వచ్చేదాకనే వాళ్ళు పిల్లలు. ఆ తర్వాత వాళ్ళని మనం ఫ్రెండ్స్ కింద చూసుకోవాలి. మన చిన్నతనంలో పెద్దవాళ్ళతో ఏం చెప్పాలన్నా హడలిపోతుండే వాళ్ళం మనం. దానివల్ల మనం ఎంత సఫర్ అయ్యేవాళ్ళమో నీకు తెలీదూ! మనమూ పిల్లల్ని ఎక్కువ కట్టుదిట్టాల్లో పెట్టామే అనుకో. మనకు తెలియకుండా ఏ చెడు అలవాట్లయినా చేసుకొనే ప్రమాదం ఉంది. మనం కూడా పిల్లలతో ఫ్రీగా మాట్లాడుతూ వాళ్ళకి కావల్సిన మినిమమ్ ఫ్రీడమ్ ఇచ్చామనుకో - వాళ్ళకి రహస్యంగా ఏ పనీ చేయాల్సిన అవసరం వుండదు. నువ్వు భయపడుతున్నదేదీ శిరి చేయలేదు. తెగించిందే అయితే ఈపాటికి అతన్ని పెళ్ళిచేసుకొని వచ్చుండేది. ఇలా మా అమ్మానాన్నలతో చెపుతానని అతనితో చెప్పుండేది కాదు. ఇప్పుడిలా మనకి ఉత్తరమూ రాసుండేది కాదు. మీకు మాట తెచ్చే పనియేదీ చేయను నాన్నా అంది. మనం దాన్ని నమ్మాలి. నమ్మని తల్లిదండ్రులున్నప్పుడే పిల్లలు తప్పటడుగులు వేస్తారు. ఇంటికి రాగానే దానిమీద కేకలేయకు. ఎంత నా దగ్గర చనువు వున్నా ఇది తన పెళ్ళి సంగతి. తండ్రి దగ్గరకన్న తల్లితోనే మనస్సు విప్పి చెప్పుకోగలరు పిల్లలు. నెమ్మదిగా అన్నీ అడిగి తెల్సుకో! ఏమంటావు?...."

"ఏమంటాను! మీరు అమెరికా వెళ్ళేముందు నేనన్న మాటలు గుర్తు చేసుకోమంటాను. అది చిన్నపిల్ల - అప్పుడే దానికి పెళ్ళేమిటి - అని మీరన్నారు. కాదు..... పిల్ల ఎదిగింది. సంబంధాలు చూడాలండీ - అని నేనన్నాను. ఇప్పుడు చెప్పండి. మీరు రైటా - నేను రైటా?"

"వేరే అడగాలా? ఎప్పుడూ నువ్వే రైటు బామ్మా!" అని మందహాసం చేసాడు రామం.

• • •

శిరీష పిక్నిక్ నుంచి వచ్చేసరికి రాత్రి పొద్దుపోయింది.

"నాన్న వచ్చారామ్మా?" అని అడిగింది ఆత్రుతగా.

"ఆ! ప్రయాణంలో అలసిపోయి వున్నారు. నీకోసం చూసి చూసి ఇప్పుడే పడుకున్నారు. అది సరే కాని.... ఆడపిల్లని నిన్నొక్కదాన్ని పంపించాడా అతను! ఇంటికి వచ్చి దిగపెట్ట కూడదూ!"

తల్లీ, తండ్రీ తన ఉత్తరం చదివారని అర్థం చేసుకుంది శిరీష. ఏదో చిత్రమైన అనుభూతితో ఆమె వాళ్ళు గరిపోడిచింది. "వచ్చారమ్మా! మనింటిదాకా వచ్చి నేను తలుపు తట్టాకనే వెళ్ళిపోయారు."

"అరె! లోపలికి రమ్మని కాస్త మంచినీళ్ళయినా ఇవ్వకుండా వెళ్ళిపోనిచ్చావా!...."

తన మీద కారాలు, మిరియాలు నూరేస్తుందనుకున్న తల్లి ఇలా మాట్లాడేసరికి శిరీష

ఉబ్బితబ్బిబ్బయిపోయింది. చటుక్కున తల్లిని కౌగిలించుకుని "నన్ను క్షమించమ్మా! నీ మనస్సింత మంచిదని నాకు తెలీలేదు" అంది.

కూతురి ముఖాన్ని తన చేతుల్లోకి తీసుకొని ముద్దుపెట్టుకొని "నువ్వొట్టి పిచ్చిపిల్లవే! నీకేం తెలీదు" అంది శశికళ. తన తలమీద నుంచి ఎంతో బరువు దిగిపోయినట్టు గాఢంగా నిట్టూర్చింది శిరీష.

కూతురికి అన్నంపెట్టి ".....రేపోసారి ఆ అబ్బాయిని మన యింటికి పిల్చుకొనిరా! నాన్న అతనితో మాట్లాడతారు." అంది శశికళ.

ఆ మర్నాడు సాయంత్రం సుధాకర్‌ని తీసుకువచ్చి తండ్రికి పరిచయం చేసింది శిరీష.... కబుర్లలో పెట్టి అతని వివరాలు అడిగి తెల్సుకున్నాడు రామం.

స్ఫురద్రూపి. మంచి ఉద్యోగం. శిరి యిష్టపడుతోంది. ఇంక తాము సందేహించవల్సింది ఏమీ లేదు. 'కదూ!' అన్నట్టు భార్యవైపు చూసాడు రామం. 'అవును' అన్నట్టు చిరునవ్వుతో జవాబిచ్చింది శశికళ.

"అయితే నేను వచ్చి మీ నాన్నగారితో మాట్లాడతాను....."

రామం మాటలు పూర్తయ్యేలోగా "నేనే వచ్చా"నంటూ ఇంట్లోకి దూసుకువచ్చాడు ఒకాయన.

శశికళ రామంలు నివ్వెరపోయారు. అంతవరకు అక్కడ నిలబడిన శిరీష తన గదిలోకి. తుర్రున పారిపోయింది.

"మా నాన్నగారు" అని పరిచయం చేసాడు సుధాకర్.

"రండి, రండి. కూర్చోండి. ఇప్పుడే మీ గురించి అనుకుంటున్నాం" అన్నాడు రామం. కుర్చీలోంచి లేచి ఆయన్ని ఆహ్వానిస్తూ.

'సాయంత్రంవేళ రంగుటద్దాలు పెట్టేకున్నాడేమిటీయన' అని తెల్లబోతూ చిత్తరువులా నిలబడిపోయింది శశికళ.

"మీ అమ్మాయిని మా యింటికి తీసుకువచ్చి చూపించాడు మా వాడు. మేం మీ అమ్మాయిని చూడ్డం అయింది. మీరు మా వాడ్ని చూడ్డం అయింది. మా వాడికి మీ అమ్మాయినిచ్చి పెళ్ళిచేద్దామనుకుంటున్నారు. అవునా!" అన్నాడాయన గంభీరంగా.

"అవునండి" అన్నాడు రామం.

"మీకూ ఈ సంబంధం ఇష్టమేనా?" అని శశికళని అడిగాడాయన.

బిత్తరపోయి చూస్తున్న శశికళ వెంటనే జవాబు చెప్పలేదు. "ఏమిటలా చూస్తావు? జవాబు చెప్పు శశీ!" అని వత్తిడి చేసాడు రామం.

"నాకిష్టమేనండి" అంది ఆమె కంగారుగా.

"అయితే కట్నం సంగతి చెప్పండి. ఫిగరు నాకు నచ్చితే ముహూర్తాలు పెట్టుకుందాం."

తండ్రి అలా కరాఖండిగా మాట్లాడ్డం సుధాకర్‌కి నచ్చలేదు కాబోలు. "నాకు కట్నం

పుచ్చుకోవటం ఇష్టంలేదు నాన్నా!" అన్నాడు.

"నువ్వు తగ్గరా!...... ఆ సంగతి పెద్దవాళ్ళం చూసుకుంటాం. ఏమంటారు?"

రామం బలవంతంగా నవ్వాడు. "మా అమ్మాయికి అచ్చటా, ముచ్చటా తీర్చాలని మాకు మాత్రం ఉండదాండీ! మా శక్తికొద్దీ...."

"అహ! అలాగనకండి మరి. మీ పెళ్ళికి మీరెంత పుచ్చుకున్నారో.... మా అమ్మాయి పెళ్ళికి అంతిస్తేచాలు!"

ఇదెక్కడి లంకె అని ఆశ్చర్యపోతూ "అలాగేనండి" అన్నాడు రామం.

"ఇప్పుడు కట్నం పుచ్చుకోవటం అఫెన్స్...."

సుధాకర్ మాటలకడ్డు వచ్చాడు అతని తండ్రి. "నువ్వు కుర్రాడివి. నువ్వూరుకోరా!...." అని రామం వైపు తిరిగి "....మనం కాస్త వివరంగా మాట్లాడుకుందాం. ఏమంటారు?" అని ఆయన నవ్వాడు.

"అలాగే!"

"మీ పెళ్ళినాడు బియ్యం బస్తా ఖరీదు ఏభయి రూపాయలు. ఇప్పుడది ఐదువందలయింది. మీ పెళ్ళికి మీ మామగారు నాల్గువేలు కట్నం ఇచ్చారు. కనుక న్యాయంగా మీరు మీ అల్లుడికి నలభైవేలు యివ్వాలి కదా!"

ఆయన నలభైవేలు అడినందుక్కాదు - తన మామగారు తనకి నాల్గువేలు కట్నం యిచ్చిన సంగతి ఇంత కరక్టుగా ఈయనెలా చెప్పాడా అని.... రామం తెల్లబోతూ భార్యవైపు చూసాడు. ఆమె ముఖం ఎర్రబడిపోయింది.

ఆయన ఇంకా వదిలిపెట్టలేదు. "...... ఇకపోతే మీరు అమెరికా రిటరన్డ్ కదా! చాలా సంతోషం...... సగం కట్నం అల్లుడికి డాలర్లలో ఇస్తే భేషుగ్గా వుంటుంది. ప్రెస్టీజీగానూ వుంటుంది! ఏమంటారు?...."

"ఎనఫ్ ఈజ్ ఎనఫ్! ఐ డోన్ట్ వాన్ట్ ఎనీ డౌరీ!" అన్నాడు సుధాకర్ జేవురించిన ముఖంతో.

"అయితే నా ఆస్తిలో నీకు చిల్లిగవ్వ కూడ దక్కదు" అని గర్జించాడాయన.

"నా రెక్కలు నాకున్నాయి. మీ ఆస్తి నాకక్కర్లేదు."

తండ్రీ కొడుకులిలా తమ యెదురుగా వాదులాడుకోవటం శశికళకి, రామంకి మహా ఇబ్బందనిపించింది. ఊరుకోండూరుకోండని ఇద్దర్నీ సముదాయించలేక సతమతమయి పోయారు వాళ్ళు.

"పెళ్ళంటూ చేసుకుంటే శిరీషనే చేసుకుంటా. లేకపోతే లేనేలేదు" అని అక్కడ్నించి లేచి విసవిసా నడుస్తూ వీధిలోకి వెళ్ళిపోయాడు సుధాకర్.

"చిన్నవాడు. ఏదో ఆవేశంలో వున్నాడు. తర్వాత సర్దిచెపుదాం. వచ్చినప్పట్నించి నిలబడే వున్నారు మీరు. ప్లీజ్ కూర్చోండి" అన్నాడు రామం.

"మా వాడ్ని బాగానే బుట్టలో వేసుకున్నారు" అన్నాడాయన శశికళవైపు చూస్తూ.

ఆ నిష్ఠూరానికి ఆమె ముఖం కందగడ్డలాగయింది. ఏదో అనబోయి భర్త ముఖం చూసి ఆగిపోయింది.

"ప్లీజ్ డోన్ట్ మిస్టేక్ మీ! ఐవిల్ టెల్ యూ వాట్ హేపెన్డ్...." అంటూ తనకు తెలిసిన విషయాలన్నీ ఆయనతో చెప్పాడు రామం.

"మీరు చెప్పేది అయిందిగా! ఇక నేను చెప్పేది వినండి. వెళ్ళి ఓ కాగితం పట్రండి."

విచిత్ర వ్యక్తిలా వున్నాడనుకుంటూ రామం కాగితం తెచ్చిచ్చాడు. పుస్తకం వొత్తు పెట్టుకొని ఆయనేదో రాస్తుంటే కాఫీ తయారు చేసి తీసుకురమ్మని భార్యకి సంజ్ఞ చేసాడు రామం.

ఆమె కాఫీ కలిపి తెచ్చేసరికి ఆయన వ్రాయటం పూర్తయింది.

"ముందు కాఫీ తాగండి" అన్నాడు రామం.

"వైనాట్!" అంటూ కప్పు అందుకున్నాడు ఆయన.

"మరి మీరు?"

"నాకు కాఫీ అలవాటు లేదు." అన్నాడు రామం సిగ్గుగా నవ్వుతూ.

"ఐనో! ఈ కాఫీ గురించే కదా మీ ఆవిడా మీరు ఓసారి డైవోర్సు చేసుకునేంత పని చేసారు!" అని నవ్వాడాయన.

భార్యాభర్తలిద్దరూ గతుక్కుమన్నారు.

"మీ సంగతి నాకెలా తెల్సిందనా మీ ఆశ్చర్యం! ఇది చదవండి....." అని అంతవరకు రాసిన కాగితాన్ని రామం చేతుల్లో పెట్టి అతను గుక్కతిప్పుకొనేలోగా పెద్ద పెద్ద అంగలు వేస్తూ బయటకు వెళ్ళిపోయాడాయన.

రామం పక్కనే మోకాళ్ళ మీద వొంగి అతనితో పాటు తనూ ఆ కాగితాన్ని గబగబ చదవసాగింది శశికళ!

మైడియర్ ఎనిమీ!

మనిద్దరం పాతికేళ్ళక్రితం ఎంతెలా ఉత్తరాలు వ్రాసుకొనే వాళ్ళమో గుర్తు తెచ్చుకో! అంతలా ఉత్తరాలు వ్రాసుకున్న వాళ్ళం ఇరవయ్యేళ్ళుగా ఒకరి ముఖం ఒకరు చూసుకోలేదు సరి కదా - ఒక్క ఉత్తరం ముక్కయినా రాసుకోకుండా ఎలా ఉండగలిగాం?.... ఇలా ఏదో నాడు హఠాత్తుగా కలవటానికేనేమో!

ఆలిండియా సర్వీసు. దేశమంతా పట్టుకు తిరుగుతున్నావు. అయినా నీ కథలు పత్రికల్లో పడుతున్నప్పుడు చదువుతూనే వున్నాను. నీ గురించి తెల్సుకుంటూనే వున్నాను. ఎప్పుడో ఒక్కసారిగా నీ ముందు ప్రత్యక్షమయి నిన్నాశ్చర్యంలో ముంచేయాలనుకున్నాను. ఇదిగో ఇన్నాళ్ళకాకోరిక ఇలా తీరింది.

ట్రాన్స్‌ఫర్ మీద నువ్వీ వూరు వచ్చావని నాకీ మధ్యనే తెల్సింది. ఎంత గమ్మత్తు జరిగిందో తెల్సా!.... ఓ రోజున కాలేజీలో ఏదో పనుండి వెళ్ళాను. ఎదురుగా కనిపించింది బాపూ బొమ్మ! స్టన్ అయిపోయాను. సరిగ్గా పాతికేళ్ళ కిందటి సీను. ఊరు మారింది. కాలేజీ

మారింది. పేరు మారింది. కాని, రూపం మారలేదు. 'ఎవరి అమ్మాయివమ్మా?' అని పలకరించి అడిగాను. ఇంకేం? నా వూహ నిజమే అయింది..... ఆమె బాపూ బొమ్మ-2 అని!

'ప్రేమించానురా ప్రేమలేఖ రాసిపెట్టరా' అని అంటే ప్రేమలేఖ రాసిపెట్టినట్టే రాసిపెట్టి ఆ బొమ్మని తనుక్కుపోయిన విలన్‌వి నువ్వు! అప్పట్నించి నీ మీద నాకు కసి. ఇన్నాళ్ళకి నీ మీద ప్రతీకారం తీర్చుకునే అవకాశం దొరికింది నాకు.

నాకంటె నీకు ముందు పెళ్ళయింది కాని, సుధాకర్ శిరీష కన్న నాల్గేళ్ళు ముందు పుట్టాడు. చాటుగా మావాడికి మీ బాపూ బొమ్మ-2 ని చూపించి ఎలా వుందని అడిగాను. వాడు అచ్చు నా కొడుకు. ముందే మూర్ఛబోయాడు!

ఒరేయ్ రాం! అప్పుడు పప్పులో కాలేసాను కాని.... ఇప్పుడు అనుభవం వుందిరా! రౌడీలు మీ అమ్మాయి వెంటబడటం - మావాడు వాళ్ళని తన్ని ఆమెని రక్షించటం - అదంతా నేను తెరచాటు నుంచి ఆడించిన నాటకం!

పరిచయం అయ్యేంతవరకే.... మా వాడు మీ శిరీష మనస్సుని పూర్తిగా దోచేసాడు. ఆ సంగతే చెపుదామని మీ యింటికి వచ్చాను. మిమ్మల్ని చూసాక మరి కాసేపు మిమ్మల్ని ఆటలాడించాలనిపించింది. గాగుల్సు పెట్టుకు వచ్చాను. కొంచెం రొంపపట్టి నా గొంతు బొంగురుగా వుంది. నేనూహించినట్టే నువ్వు నన్నసలు గుర్తుపట్టలేదు... అందుకే కట్నం గిట్నం అని నిన్నదర కొట్టేసాను. అదంతా నిజమనుకొని మా వాడు కోప్పడిపోయాడు. మన కథ పిల్లలకి తెలీదుగా!

ఏం! ఎలా వుంది మన తడాఖా! బాపూ బొమ్మ-2 ని నా కోడలిగా గ్రేబ్ చేసి పట్టుకుపోతున్నా. నువ్వప్పుడు చేసిన పనికి నీకిదే శిక్ష!

వెంటనే పిల్లల పెళ్ళికి ముహూర్తం పెట్టించు.

నీ ఫ్రెండ్లీ విలన్

-వేణు.

రామం, శశికళలు పూర్తిచేసిన ఉత్తరంలోంచి తలలెత్తి ఒకరి మొహంలోకి ఒకరు క్షణకాలం నిర్లిప్తంగా చూసుకున్నారు. మరుక్షణం ఇద్దరూ తెరలు తెరలుగా నవ్వుకోసాగారు.

అప్పుడే అక్కడికొచ్చిన శిరీష అయోమయంగా వాళ్ళవంక చూడసాగింది.

శశికళ శిరీషను ఆప్యాయంగా అక్కున చేర్చుకుని, "నువ్వు నిజంగా 'చిన్నబొమ్మ'వే తల్లీ!" అంటూ నుదుట ముద్దాడింది.

అంతలో వీధిలోంచి వేణుతో పాటు ఇంట్లోకి అడుగుపెట్టిన సుధాకర్, "హాయ్! చినబొమ్మా!" అన్నాడు కొంటెగా!

శిరీష సిగ్గుల మొగ్గే అయింది.

రామం, వేణులు గాఢాలింగనంలో మునిగి స్నేహసముద్రంలో తేలియాడసాగారు.

●